

సోమశిలకు 6,296 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

సోమశిల: జలాశయానికి శనివారానికి 6,296 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. జలాశయం 10.795 టీఎంసీలకు చేరింది. దిగువకు 210 క్యూసెక్కు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.72,160
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,480
3 శాతం జీఎస్టీతో	రూ.6,674
నవర (8గ్రా)	రూ.53,392

గరిష్టం/కనిష్టం
37.1 /27.5

వాతావరణం

జిల్లాలో ఆదివారం పగలు ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. రాత్రి అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవాశం ఉంది. తేమ 52 శాతం ఉంది.

నిర్ధాక్షిణ్యంగా కడుపు కొట్టారు



ఇరవై ఏళ్లుగా వీఓఏగా.. ఎక్కడా ఎలాంటి వివాదాలు లేకుండా పని చేస్తున్నాను. నా కుటుంబానికి ఇదే జీవనాధారం. మాపై రాజకీయ కక్ష గట్టి నిర్ధాక్షిణ్యంగా తొలగించారు. టీడీపీకి చెందిన మహిళను నియమించేందుకు నా కడుపు కొట్టారు. ఇంత కంటే దారుణం లేదు. విషయం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకుపోకుండా స్థానిక నేతలే ఈ దారుణానికి పాల్పడ్డారు.

– కాయల లక్ష్మి, నార్తురాజుపాళెం, తొలగించిన వీఓఏ

కారణం లేకుండా డీలర్ షిప్ తీసేశారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎటువంటి కారణం లేకుండానే మా రేషన్ డీలర్ షిప్‌ను నిలిపివేశారు. మా మామయ్య జాగీరు సుబ్బయ్య 30 ఏళ్ల రేషన్ డీలర్‌గా పని చేశాడు. ఆయన మరణానంతరం 2018 నుంచి సంఘం ద్వారా నేను డీలర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. మా దుకాణంపై ఇప్పటి వరకు ఎటువంటి ఫిర్యాదులు, సమస్యలు రాలేదు. గత నెల నుంచి మాకు సమాచారం లేకుండా రేషన్ సరుకులను టీడీపీ నాయకుల ద్వారా పంపిణీ చేయిస్తున్నారు.

– జాగీరు మీనా, పెద్దకొండూరు, కలిగిరి మండలం

ఏ ఉత్తర్వులు లేకుండా తొలగించారు



వలేటివారిపాళెం మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా ఐదేళ్ల నుంచి పనిచేస్తున్నాను. నాకు ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వకుండా ఉద్యోగం నుంచి తొలగించారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ బెదిరించి మరీ తొలగిస్తున్నాడు. మద్యం షాపులో సరుకుకు సంబంధించి మేము ష్యూరిటీ బాండ్లు ఇచ్చాం. కనీసం ఆ సరుకు అప్పగించినట్లు రసీదు ఇవ్వమన్నా కూడా వినడం లేదు. మీకు సంబంధం లేదు వెళ్లిపోండి అంటూ బలవంతంగా తొలగించారు.

– వెంకటస్వామి, వీవీపాళెం, సూపర్‌వైజర్

న్యూస్‌రీల్

యాష్‌పాండ్‌కు భారీగా పడిన గండి



ఏపీజెన్‌కో యాష్‌పాండ్‌కు గండి

- పంట పొలాలు బూడిద మయం

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో థర్మల్ ప్రాజెక్ట్‌కు చెందిన ఒకటో దశ యాష్ పాండ్ (బూడిద చెరువు)కు శనివారం సాయంత్రం గండిపడింది. పడమటి వైపు 10 అడుగులకుపైగా ఎత్తు ఉన్న యాష్‌పాండ్ కట్ట సుమారు 8 మీటర్లకు పైగా గండి పడడంతో చెరువులో ద్రవరూపంలో ఉన్న బూడిద పంట పొలాలను ముంచెత్తింది. రొయ్యల చెరువులను చుట్టు ముట్టింది. ఈ హఠాత్ పరిణామానికి ముసునూరువారిపాళెం, పైనాపురం, నేలటూరు, వరకవిపూడి తదితర చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆందోళన చెందారు. చెరువులోని బూడిదంతా దాదాపు ఖాళీ అయింది. ద్రవ రూపంలోని బూడిద భూమి లోపలకు ఇంకిపోతే పంట పొలాలకు, భూగర్భ జలాలకు ముప్పు ఏర్పడుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. చెరువులో ద్రవ రూపంలో ఉన్న బూడిదను రీ సైక్లింగ్ చేసేందుకు అమర్చిన విద్యుత్ మోటార్లు చెడిపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. మరో వైపు చెరువులో బూడిద నిల్వలు పెరిగిపోవడంతో ఒత్తిడి పెరిగి, కట్ట తెగిపోయి ఉంటుందని మరో వాదన ప్రచారంలో ఉంది. ముఖ్యంగా జెన్‌కో ప్రాజెక్ట్ ఇంజినీర్ల నిర్వహణ లోపం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

200 ఎకరాల్లో బూడిద మేట



ద్రవరూపంలో పంట పొలాల వైపు ప్రవహిస్తున్న బూడిద

చెరువులో నుంచి వచ్చిన బూడిద నీరు దాదాపు 200 ఎకరాలను ముంచెత్తింది. పొలాల్లో బూడిద సుమారు అర అడుగు నుంచి అడుగు మేర మేట వేసినట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. బూడిద నీరు కూడా భూమిలోకి ఇంకిపోవడంతో పంట పొలాలు నిర్వీర్యం అయిపోతాయని విచారం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంతో పాటు జెన్‌కో యాజమాన్యమే తమ భూముల్లో బూడిద మేటలను తొలగించాలని కోరుతున్నారు.

పదోన్నతిపై న్యాయమూర్తి బదిలీ

నెల్లూరు (లీగల్): నెల్లూరు ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జి.కబర్ధి పదోన్నతిపై కర్నూలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఈ కోర్టుకు ఫుల్ అడిషనల్ చార్జిగా 8వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జిని కొనసాగిస్తూ ఏపీ హైకోర్టు ఉత్తర్వులను శనివారం జారీ చేసింది.

నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి భరద్వాజ

నెల్లూరు (లీగల్): న్యాయవాదులు నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పినపాటి భరద్వాజ అన్నారు. జిల్లా కోర్టులోని న్యాయవాదుల సమావేశ మందిరంలో శనివారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి మూడు నూతన క్రిమినల్ చట్టాలు అమల్లోకి వచ్చాయన్నారు. గతంలో సివిల్ ప్రొసిజర్ కోడ్ 1973, భారతీయ శిక్షా స్మృతి 1860, భారతీయ సాక్ష్యాధారాల చట్టం 1872 ఐపీసీ సెక్షన్లుగా ఉన్నాయని, ఇప్పుడు అవి భారతీయ నాగరిక సురక్ష 2023, భారతీయ సురక్ష సంహిత 2023, భారతీయ సాక్ష్య అధినియం 2023, బీఎస్ఎల్ చట్టాలుగా అమల్లోకి వచ్చాయన్నారు. మరో న్యాయమూర్తి పాలమంగళం వినోద్ మాట్లాడుతూ ఈ మూడు నూతన క్రిమినల్ చట్టాలపై న్యాయవాదులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, బార్ ప్రధాన కార్యదర్శి సుందరయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

చిరుద్యోగులపై రాజకీయాస్త్రం

- ఉపాధి హామీ ఎఫ్ఏలు, ఆశా వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తల తొలగింపు
- తాజాగా రేషన్‌షాపు డీలర్లు, పొదుపు వీఓఏలు..
- ప్రతి పోస్టుకు రేటు పెట్టి తమ్ముళ్ల వసూళ్లు
- కోవూరులో రేషన్ డీలర్‌కు రూ.3 లక్షల రేటు ఫిక్స్ చేసిన టీడీపీ నేత
- కందుకూరు మున్సిపాల్టీ, మార్కెటింగ్ కమిటీలో 35 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపునకు యత్నాలు
- వైన్ షాపుల్లో సేల్స్ మెన్, సూపర్‌వైజర్లను తొలగించే కుట్రలు
- రోడ్డున పడి రోదిస్తున్న చిరుద్యోగులు

▸▸ పేదల పొట్టకొడుతున్న పచ్చపార్టీ నేతలు



‘పాముకు పాలు పోసినా.. అది విషమే కక్కుతుందని’ టీడీపీ మరోసారి తన నైజాన్ని చాటుకుంది. గతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కులం, మతం, ప్రాంతాలే కాకుండా ఆఖరికి రాజకీయ పార్టీలు చూడకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చింది. తాజాగా అబద్ధాలు చెప్పి అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన టీడీపీ రాజకీయాస్త్రంతో అల్పులైన ‘పేద కుటుంబాల కడుపు’ కొడుతోంది. ప్రభుత్వ శాఖల్లో అల్ప వేతనాలకు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేసే చిరు ఉద్యోగులకు రాజకీయ రంగు పులిమి రోడ్డున పడేస్తోంది. చిరు ఉద్యోగాలను నమ్ముకుని బతికే ఆ కుటుంబాలు గుండెలవిసేలా రోదిస్తున్నాయి.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అధికార మదం తలకెక్కి.. టీడీపీలో గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి నేతల వరకు కాలకేయుడిని మించిపోతున్నారు. ఓ వైపు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, నేతలపై భౌతిక దాడులు, ఆస్తుల విధ్వంసం కొనసాగిస్తూనే.. మరో వైపు వారి బతుకు దెరువుపై దెబ్బకొడుతున్నారు. తాజాగా వివిధ శాఖల్లో పనిచేసే చిరుద్యోగులపై పచ్చాస్త్రం ఎక్కు పెట్టి ఏళ్ల తరబడి ఆ కొలువుల్లో కొనసాగుతున్న వారిని అర్ధంతరంగా తీసి పడేసి ఆ స్థానాల్లో పక్కా టీడీపీ కేడర్‌తో నియామకాలు చేపడుతున్నారు. అందరికీ ఉద్యోగాలు కల్పిస్తాం.. లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామంటూ ప్రచారం చేసిన కూటమి పాలకులు ప్రభుత్వ శాఖలను పచ్చ పార్టీ కార్యకర్తలతో నింపుతున్నారు. ఆ స్థానాల్లో కూర్చోబెట్టేందుకు సదరు కార్యకర్తల దగ్గరే రూ.లక్షల వసూలు చేస్తున్న పరిస్థితి జిల్లాలో నెలకొంది.

జేబులు నింపుకోవడమే పరమావధి

టీడీపీ అధికారంలోకి వచ్చింది మొదలు ఆ పార్టీ నాయకులు జేబులు నింపుకోవడమే పరమావధిగా వ్యవహరిస్తున్నారు. చివరకు చిరుద్యోగులను కూడా విడిచి పెట్టడం లేదు. గ్రామ స్థాయిలో కీలకమైన అంగన్‌వాడీ, పారిశుద్ధ్య కార్మికులు, రేషన్ డీలర్లు, ఆశా వర్కర్లు, పొదుపు గ్రూపులకు సంబంధించిన వీఓఏలు, వైన్ షాపుల్లో పని చేసే సేల్స్‌మెన్‌లు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై కత్తికట్టారు. ఏళ్ల తరబడి ఆ కొలువుల్లో కొనసాగుతున్న వారందరినీ తొలగించి ఆయా స్థానాల్లో తమ వారిని నియమించుకునేందుకు సామదాన దండోపాయాలు ప్రయోగిస్తున్నారు. మా ప్రభుత్వం వచ్చింది.. మేము చెప్పిన వారే ఉండాలి.. మీరు ఉండడానికి వీల్లేదంటూ అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు. ఆ ఉద్యోగాల్లో కొనసాగించాలంటే ఒక్కో పోస్టుకు ఒక్కో రేటు ఫిక్స్ చేసి డిమాండ్ చేస్తున్నారు. వీరి ధాటికి చిరుద్యోగులు హడలిపోతున్నారు. తొలగించిన వారి కుటుంబాలు వీధిన పడి లబోదిబోమంటున్నాయి.

జిల్లాలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు	- 581
సీనియర్ మేట్‌లు	- 100
జిల్లాలో పొదుపు గ్రూపుల వీఓఏలు	- 1,200
అంగన్‌వాడీ వర్కర్లు	- 3,774
ఆశా వర్కర్లు	- 1,885
రేషన్ డీలర్లు	- 1,513

రూ.2 లక్షలకు పోస్టుల అమ్మకం

గ్రామాల్లో కీలకమైన అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, రేషన్ డీలర్లు, వీఓఏలను తొలగించి ఆ స్థానాల్లో తమ వారిని నియమించుకునేందుకు టీడీపీ నేతలు కుట్రలు చేస్తున్నారు. బెదిరించి రాజీనామాలు చేయిస్తున్నారు. లొంగకపోతే.. వారి సంతకాలను ఫోర్జరీ చేసి వారే రాజీనామా చేస్తున్నట్లు అధికారులకు లేఖలు పంపిస్తున్నారు. కందుకూరులో బరితెగించిన టీడీపీ నేతలు 16 మంది రేషన్ డీలర్ల సంతకాలను ఫోర్జరీ చేసి రాజీనామాలు చేసినట్లుగా అధికారులకు లేఖలు పంపించి, ఆ డీలర్ షిప్‌లను తమ పార్టీ నేతలకు అప్పగించారు. నిబంధనల ప్రకారం డీలర్ల భర్తీని రిజర్వేషన్ విధానంలో చేపట్టాల్సి ఉంది. ఇందుకు సంబంధించి నోటిఫికేషన్, దరఖాస్తుల ప్రక్రియ, విద్య, కులం అర్హతలను బట్టి ఇంటర్వ్యూలు నిర్వహించాక అర్హులైన వారిని ఎంపిక చేస్తారు. కానీ ఇవేవి లేకుండా టీడీపీ అయితే చాలు.. అదే అర్హత అన్నట్టు కట్టబెట్టేస్తున్నారు. ఇందు కోసం ఒక్కొక్కరి దగ్గర రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు దండుకున్నట్లు సమాచారం. కోవూరు మండలం గంగవరంలో రేషన్ షాపు డీలర్‌ను రూ.3 లక్షల ఇస్తే.. నిన్ను ఉంచుతాం.. లేదంటే వేరే వాళ్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారంటూ బేరం పెట్టారు. చివరకు రూ.2 లక్షలు ఫిక్స్ చేసుకున్న వీడియో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. కొడవలూరు, విడవలూరు మండలాల్లో వీఓఏలను తొలగించి వారి స్థానంలో తమకు అనుకూలమైన వారిని నియమించుకున్నారు. ఒక్కొక్క పోస్టుకు రూ.2 లక్షల వంతున వెలకట్టినట్లు ప్రచారం జరుగుతోంది.



S.No	Name of the Proposed Persons	Address
1	Alina Swapna	Dacharu-1
2	Avula Aruna	Dacharu -2

In this regard, I request you to consider the request and to do the needful as per rules in vogue.

Thanking you,

Yours sincerely,

Kurugondla Rama Krishna
MLA
Venkatagiri Assembly Constituency.

వీఓఏలను తొలగించాలని వెంకటగిరి ఎమ్మెల్యే సిఫార్సు లేఖ

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై కత్తి

కందుకూరు మున్సిపాల్టీ, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీల్లో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపునకు అధికారులు సిద్ధం చేశారు. స్థానిక ఎమ్మెల్యే సిఫార్సుతో ఇప్పటికే దాదాపు 40 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో నగదు ఇచ్చిన వారిని నియమించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆ పోస్టును బట్టి రూ.5 లక్షల వరకు రేటు పెట్టి బహిరంగంగానే పోస్టుల విక్రయాలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. టీడీపీ నేతలు చివరకు ఎంతలా దిగజారారంటే పంచాయతీల్లో పని చేసే పారిశుద్ధ్య కార్మికులపై కూడా కత్తికట్టారు. మున్సిపాల్టీల్లో కూడా కార్మికుల తొలగింపునకు ప్రయత్నిస్తునారు. ఆ పనుల్లో కూడా తమ వారే ఉండాలని ఒత్తిళ్లు చేస్తున్నారు. వారిలో ఎక్కువ మంది పేదవారే ఉంటున్నారు.. పూట గడుపుకోవడం కష్టంగా ఉండే పేదల పొట్టగొట్టే ప్రయత్నాలు చేస్తుండడంతో టీడీపీ నేతల తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ఇక జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి ఆ స్థానాల్లో తమ వారిని పెట్టుకునేందుకు ఇప్పటికే పనులు ఆపేసిన విషయం తెలిసిందే. ఆత్మకూరు నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఉపాధి పనులు నిలిపివేయాలని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఆదేశాలివ్వడంతో పనులు నిలిపివేయడం గమనార్హం.

వైన్ షాపు ఉద్యోగులపై వేటు

ప్రభుత్వ అజమాయిషీలో నిర్వహిస్తున్న వైన్ షాపుల్లో పని చేసే సేల్స్ మెన్, సూపర్‌వైజర్ చిరుద్యోగులపై కూడా టీడీపీ నేతలు కన్నెర్ర చేశారు. ఇప్పటికే కావలి, కందుకూరు, నెల్లూరు రూరల్, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని వైన్ షాపుల్లో పనిచేసే చిరుద్యోగులను తొలగించే ప్రక్రియ ప్రారంభించారు. మద్యం పాలసీకి ఇంకా గడువు ఉండడంతో వెనువెంటనే ఆ చిరుద్యోగులను తొలగించి తమ వారిని నియమించుకుని వారి ద్వారా బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా చేయించే దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్యం ధర కంటే అదనంగా మరో రూ.20 వంతున అమ్మించి సొమ్ము చేసుకునేందుకు తమ్ముళ్లు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం

ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండానే విధుల నుంచి తొలగించిన చిరు ద్యోగులు శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఎటువంటి కారణం లేకుండా, తమకు ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వకుండా అక్రమంగా తమను ఉద్యోగాల నుంచి తొలగించారంటూ వారంతా ఫిర్యాదు చేశారు. వాస్తవానికి నియామకం జరిగే సమయంలో ఎక్సైజ్ శాఖ నుంచి నియామక ఉత్తర్వులు ఇచ్చి ఉద్యోగాల్లో చేర్చుకున్నారు. తొలగించేటప్పుడు మాత్రం ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వకుండా కేవలం నోటి మాటతో తమను తొలగించినట్లు చెబున్నారని ఇది అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో షాపులను తమ నుంచి స్వాధీనం చేసుకునే సమయంలో ఒక్కొక్క షాపులో రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల విలువ చేసే మద్యం ఉందని, కనీసం సరుకు మొత్తం తాము స్వాధీనం చేసినట్లు అయినా రాసి ఇవ్వాలని కోరితే మీకు సంబంధం లేదు, మీకెందుకు అవన్ని అంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేపు ఏదైనా అక్రమాలు జరిగాయంటూ తమను బాధ్యులను చేస్తే తమ పరిస్థితి ఏమిటని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న మద్యం దుకాణాల సేల్స్ మెన్స్

అన్యాయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోతాం



ఇరవై ఏళ్లుగా వీఓఏ వృత్తినే నమ్ముకొని జీవిస్తున్న మమ్ములను అర్ధాంతరంగా తొలగించి టీడీపీకి చెందిన వారిని నియమించారు. బిడ్డలు కలిగిన మమ్ముల్ని నిర్ధాక్షిణ్యంగా తొలగిస్తే మా బతుకు దెరువు ఏం కావాలి. మమ్ములను రోడ్డున పడేసి మరొకరిని నియమించడం ఎంత వరకు సమంజసం. టీడీపీ నాయకులు చేసిన ఈ అన్యాయాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకుపోతాం.

– గోనె కుమారి, నార్తురాజుపాళెం, తొలగించిన వీఓఏ

ఇంతటి దారుణం ఎప్పుడూ చూడలేదు



ఎక్కడా లేని విధంగా కొడవలూరు మండలంలోనే వీఓఏలను తొలగించారు. ఇలాంటి ఘటనలు గతంలో ఎప్పుడూ జరగలేదు. ఎక్కడైనా ఖాళీలుంటే వాటిని అధికార పార్టీ వారితో నింపడం జరిగేది. కానీ ఎప్పుడూ లేని విధంగా ఈ సారి పని చేసుకొని జీవిస్తున్న మమ్మల్ని నిర్ధాక్షిణ్యంగా తొలగించి టీడీపీ సానుభూతి పరులను నియమించారు. ఎప్పుడూ లేని విష సంస్కృతిని కొనసాగిస్తున్నారు.

– బచ్చు కృష్ణవేణి, నార్తురాజుపాళెం, తొలగించిన వీఓఏ

ఉన్నపళంగా రోడ్డున పడేశారు



ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సేల్స్ మెన్ ఉద్యోగాలు చేసుకుంటున్న మమ్మల్ని ఎటువంటి ఉత్తర్వులు లేకుండా తొలగించారు. ఉద్యోగం పోయి ఉపాధి లేక కుటుంబంతో సహా రోడ్డుపడ్డాం. అదేమని అడిగితే మమ్మల్ని బెదిరిస్తున్నారు. రేపు షాపుల్లో ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

– షార్జాహాన్, లింగసముద్రం మద్యం షాపు సేల్స్ మెన్

తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

నెల్లూరు (దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయి తిరిగి వచ్చిన తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఖరారు చేస్తూ కలెక్టర్ ఒ. ఆనంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

పోస్టింగ్ స్థానం	తహసీల్దార్ పేరు
నెల్లూరు ఆర్డీఓ కార్యాలయ డీఏఓ	జీ రాఘవేంద్రరావు
నెల్లూరురూరల్	డీ లాజరస్
నెల్లూరు అర్బన్	షేక్ షఫీమాలిక్
కోవూరు	ఏ నిర్మలానందబాబా
బుచ్చిరెడ్డిపాళెం	ఏ వెంకటేశ్వర్లు
టీపీ గూడూరు	ఎం పద్మజ
వెంకటాచలం	ఎన్ శ్రీనివాసులు
మనుబోలు	సీహెచ్ సుబ్బయ్య
రాపూరు	ఎం శ్యాంసుందరరాజ
ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయ డీఏఓ	ఎం నిరంజన్
ఆత్మకూరు	వీ సుధీర్
చేజర్ల	ఏవీ రమణరావు
ఏఎస్‌పేట	డీ శ్రీరామకృష్ణ
సంగం	బి సోమ్లానాయక్
అనంతసాగరం	వీ వీరవసంతరావు
ఉదయగిరి	ఎం సుభద్ర
కావలి ఆర్డీఓ కార్యాలయ డీఏఓ	ఆర్ సూర్యనారాయణ సింగ్
జలదంకి	పీ హేమంత్‌కుమార్
దుత్తలూరు	వై నాగరాజు
కొడవలూరు	కె స్ఫూర్తి
విడవలూరు	కె చంద్రశేఖర్
వింజమూరు	ఎస్ఎం హమీద్
కందుకూరు సబ్‌కలెక్టరేట్ డీఏఓ	టీ శ్రీనివాసులు
కందుకూరు	సయ్యద్ ఇక్బాల్
లింగసముద్రం	ఈ రమాదేవి
ఉలవపాడు	వీ లావణ్య
వలేటివారిపాళెం	షేక్ అబ్దుల్ హమీద్
కొండాపురం	కేవీబీటీ సుందరమ్మ
వరికుంటపాడు	ఎస్ ఎండీ హుస్సేన్
కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి	టీ విజయకుమార్
కలెక్టరేట్ డీ అండ్ హెచ్ సెక్షన్	పీ శాంతకుమారి
కలెక్టరేట్ ఈ అండ్ ఎఫ్ సెక్షన్	ఎస్ శ్రీనివాసులరెడ్డి
కలెక్టరేట్ జీ సెక్షన్	ఎంవీకే సుధాకర్‌రావు
కలెక్టరేట్ లీగల్ సెల్	పీ విజయకుమార్
కేఆర్ఆర్‌సీ	పీ శ్యామలమ్మ

ఎల్‌పీ ప్రత్యేక తహసీల్దార్లుగా ఎన్.రమాదేవి, టీ శ్రీనివాసులు, కేపీటీపీఎస్ ప్రత్యేక తహసీల్దారుగా కె రాజ్యలక్ష్మి, ఐటీడీఏ ఏపీఓగా సీ రవింద్రబాబును నియమించారు. ఐఎస్ ప్రసాద్, పీ అనురాధ, పీ లక్ష్మీనరసింహంలను తిరుపతి జిల్లాకు బదిలీ చేశారు.

నకిలీ పట్టాలపై చర్యలకు ఆదేశం

సోమశిల: అనంతసాగరం మండలం బొమ్మవరం అగ్రహారంలో జగనన్న లేఅవుట్‌లో ఇచ్చిన పట్టాలపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా అవి నకిలీ అని తేలిందని, ఆ పట్టాలపై తదుపరి చర్యల కోసం ఆదేశాలు జారీ చేసినట్లు అనంతసాగరం ఇన్‌చార్జి తహసీల్దార్ గిరీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారి, సర్వేయర్లు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారని, ఆ సమయంలో కొందరు తమ వద్ద ఉన్న ఇంటి పట్టాలను సమర్పించారని, వారు ఇచ్చిన పట్టాల్లో తహసీల్దారు సంతకం ఫోర్జరీ చేసినట్లు గుర్తించారన్నారు. ఈ విషయమై తదుపరి విచారణకు అనంతసాగరం ఎస్సైకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆయన విచారణలో కార్యాలయ రికార్డుల్లో వారి పట్టాలు నమోదు కాలేదని, ఆ పట్టాల్లోని తహసీల్దార్ సంతకం వేరుగా ఉందని, తహసీల్దారు కార్యాలయ ముద్ర కాకుండా కార్యాలయ తేదీ ముద్ర వేసి ఉందన్నారు. దీంతో సదరు పట్టాలను నకిలీ పట్టాలుగా రుజువైనందున బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఎస్సైకు ఆదేశాలు జారీ చేశామన్నారు. నివేదికను ఆర్డీఓకు అందజేశామన్నారు.

క్లుప్తంగా

డీటీలకు తహసీల్దార్లుగా బాధ్యతలు

నెల్లూరు(దర్గామిట్ట): ఉమ్మడి జిల్లాలో పలు మండలాల్లో డీటీలకు తహసీల్దార్లుగా బాధ్యతలు కల్పిస్తూ శనివారం జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. కొడవలూరు డీటీ పి.శైలకుమారి, దుత్తలూరు డీటీ శ్రీనివాసులు, గూడూరు డీటీ కె.శిరీషా, దక్కిలి డీటీ హరికృష్ణను తిరుపతి జిల్లాకు పంపారు. కావలి డీటీ టీవీఎం కృష్ణప్రసాద్‌ను ఇందుకూరుపేట, జీఏడీ నుంచి ఎ.లక్ష్మీనారాయణను అల్లూరు, సెలవులో ఉన్న పి.శ్రావణ్‌కుమార్‌ను కావలి, నెల్లూరు సిటీ ఈడీటీ జి.స్వర్ణను గుడ్లూరు, సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయ డీటీ జె.స్వప్నను మర్రిపాడు, వాకాడు ఎంఎల్ఎస్ పాయింట్ డీటీ ఎ.సారంగపాణిని పొదలకూరు, సెలవులో ఉన్న డీటీ ఎం.సురేష్ బాబు బోగోలు, కొండాపురం డీటీ ఎం.కోటేశ్వరరావును దగదర్తి తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

హెచ్‌టీ వినియోగదారుల సమస్యలపై దృష్టి

• ఏపీఎస్పీడీసీఎల్ జీఎం రాజధర్మజ్ఞాని



మాట్లాడుతున్న ధర్మజ్ఞాని

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో ఉన్న హెచ్‌టీ విద్యుత్ వినియోగదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాం. వారి కోసం వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశాం' అని ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (రెవెన్యూ, ఇంటర్నల్ ఆడిట్) కోట శేఖర రాజధర్మజ్ఞాని అన్నారు. నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో శనివారం హెచ్‌టీ వినియోగదారుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 776 హెచ్‌టీ విద్యుత్ సర్వీసుల ద్వారా నెలకు బిల్లుల రూపంలో సంస్థకు రూ.130 కోట్లు వస్తోందన్నారు.
• లో ఓల్టేజీ సమస్యపై ఒకరు ఫిర్యాదు చేశారు. సెక్యూరిటీ డిపాజిట్ తగ్గించాలని అరబిందో కంపెనీ ప్రతినిధి కోరారు. ఎలక్ట్రిసిటీ డ్యూటీ రేటు రూ.1 వసూలు చేస్తున్నారని, దీనిపై సరైన నిర్ణయం తీసుకోవాలని ఒకరు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, డీఈటీ శేషాద్రి బాలచంద్ర, ఈఈ, డీఈఈలు పాల్గొన్నారు.

పెయిన్ కిల్లర్స్‌తో బీ కేర్‌ఫుల్

• మోతాదుకి మించి వాడితే ఎన్నో అనర్థాలు
• ప్రధానంగా కిడ్నీ, లివర్, గుండెపై ప్రభావం
• డాక్టర్ల సిఫార్సు ఎంతో ముఖ్యం
• ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇచ్చేస్తున్న మెడికల్ షాపుల యజమానులు
• చోద్యం చూస్తున్న జిల్లా ఔషధ నియంత్రణ శాఖ

నెల్లూరు వేదాయపాళేనికి చెందిన 58 ఏళ్ల రమణయ్య ఇటీవల నగరంలోని ప్రభుత్వాస్పత్రికి నడుంనొప్పితో వెళ్లాడు. స్కానింగ్, రక్తపరీక్షలు చేయగా కిడ్నీ సమస్య ఉందని తేలింది. రక్తంలో క్రియాటిన్ లెవల్ పెరిగిపోవడంతో డయాలసిస్ చేయాలని డాక్టర్ చెప్పాడు. తనకు ఎలాంటి అలవాట్లు లేవని, ఈ పరిస్థితి ఎందుకొచ్చిందని అతను అడిగాడు. దీంతో డాక్టర్ నొప్పుల మాత్రలు వాడుతున్నావా అనడిగాడు. కాళ్ల నొప్పులుండగా మెడికల్ షాపునకు వెళ్లి టాబ్లెట్స్ తీసుకుని వాడుతున్నట్లు చెప్పాడు. ఆ మందులు వాడినందు వల్ల కిడ్నీ సమస్య వచ్చి ఉండొచ్చని డాక్టర్ తెలిపాడు. ఇలాంటి సంఘటనలు చాలాచోట్ల జరుగుతూనే ఉంటాయి.

నెల్లూరు(అర్బన్): మనుషుల జీవనశైలిలో చాలా మార్పులొచ్చాయి. ఆహార పదార్థాల కల్తీమయం కావొచ్చు. ఇతర కారణాలు ఏమైనా ఉండొచ్చు. చాలామంది ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు. 40 ఏళ్లకే మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారు ఎందరో ఉన్నారు. తలనొప్పి, నడుం నొప్పితో తరచూ ఇబ్బంది పడేవారి సంఖ్య ఎక్కువగానే ఉంది. 60 ఏళ్లు నిండిన వారిలో అధిక శాతం మందికి నిత్యం మోకాళ్లు, కీళ్ల నొప్పులు వస్తున్నాయి. దీంతో వారు అందుబాటులో ఉండే మెడికల్ షాపులకెళ్లి పెయిన్ కిల్లర్స్ మాత్రలు తెచ్చుకుని తాత్కాలికంగా ఉపశమనం పొందుతున్నారు. ఇంకొందరు ఇంజెక్షన్లు వేయించుకుంటున్నారు. వైద్యులతో సంబంధం లేకుండా ఇష్టారాజ్యంగా మందులు వినియోగిస్తే కిడ్నీలు దెబ్బతినే అవకాశముంది. సొంత నిర్ణయాలతో నొప్పుల మాత్రలు తరచూ వాడే వారు అనారోగ్యం బారిన పడుతున్న ఘటనలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఆ పరిస్థితిని నుంచి బయట పడేందుకు ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లి భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నారు.

దాడులు చేయకుండా..

జిల్లాలో రిటైల్ మందుల దుకాణాదారులు రోగులకు సొంతంగా వైద్యం చేస్తున్న పరిస్థితి ఉంది. నొప్పులు, జ్వరం, మోషన్స్, కడుపులో మంట, మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లు, గాయాలకు ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులిస్తున్నారు. నెల్లూరులో చూస్తే బుజబుజనెల్లూరు, శివగిరికాలనీ, వెంకటేశ్వరపురం తదితర అనేక ప్రాంతాల్లో రోగిని నిలబెట్టి ఇంజెక్షన్ సైతం వేస్తున్నారు. వీరు కనీసం ఆర్‌ఎంపీలు కూడా కాదు. రోగికి ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారో.. ఇలాంటి వారిపై ఆకస్మిక దాడులు చేసి కేసులు నమోదు చేయాల్సిన జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. నెలవారీ మామూళ్లు తీసుకుని దాడులు చేయడం లేదనే ఆరోపణలున్నాయి.



జిల్లాలో..

కిడ్నీ కేసులు : 3,185

ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న వారు : రోజుకు పదిమంది

రిటైల్ మెడికల్ షాపులు : 1,500

హోల్‌సేల్ దుకాణాలు : 650

సమస్యలొస్తాయి



నొప్పుల మాత్రలను ఇష్టమొచ్చినట్లు వాడకూడదు. నొప్పుల నివారణకు ఇంజెక్షన్లు వేయించుకునే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. డాక్టర్లను సంప్రదించి వారి సిఫార్సుతో మాత్రమే పరిమితులకు లోబడి మాత్రలు వేసుకోవాలి. లేదంటే కిడ్నీతోపాటు అల్సర్, ఇతర సమస్యలొస్తాయి.

– డాక్టర్ గంగాధర్, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్, నెల్లూరు

ఎంతో ప్రభావం ఉంటుంది



నొప్పుల మాత్రలు ఇష్టారాజ్యంగా దీర్ఘకాలికంగా వాడితే సమస్యలు కొని తెచ్చుకున్నట్లే. అలా వాడే వారికి కిడ్నీ సమస్యలతో పాటు పేగుల్లో అల్సర్స్(పుండ్లు) ఏర్పడవచ్చు. ఒక్కోసారి పేగుకు చిల్లు పడే అవకాశం ఉంది. అలా జరిగితే తక్షణమే ఆపరేషన్ చేయాల్సి వస్తుంది. లేదంటే ప్రాణాంతకం. శరీరంలోని ఇతర ఆర్గాన్స్‌పై కూడా నొప్పుల మాత్రలు ప్రభావం చూపుతాయి. అందువల్ల డాక్టర్ల సూచనతోనే వినియోగించాలి.

– డాక్టర్ శ్రీనునాయక్, డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల, నెల్లూరు

ఎన్నో కేసులు



జిల్లా వ్యాప్తంగా 52 పీహెచ్‌సీలు, 28 అర్బన్ హెల్త్ సెంటర్లు, ఆత్మకూరులో ఒక జిల్లా ఆస్పత్రి, కందుకూరు, కావలిలో ఏరియా ఆస్పత్రులు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా కేంద్రంలో ఒక బోధనాస్పత్రి (సర్వజన ఆస్పత్రి) ఉన్నాయి. వీటి పరిధిలో వైద్యశాఖ గణాంకాల ప్రకారం 3,185 మంది కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ ఒక్క సంవత్సరంలో ఇప్పటి వరకు 405 కిడ్నీ కేసులు నమోదయ్యాయి. గతేడాది లెక్కల ప్రకారం 3,274 మంది గుండె జబ్బుతో బాధపడుతున్నారు. కేవలం పీహెచ్‌సీల స్థాయిలోనే 64,119 మంది షుగర్ వ్యాధితో బాధపడుతున్నారు. రకరకాల కారణాలతో జబ్బులు వచ్చినా వీరిలో అనేక మంది నొప్పుల మాత్రలు సొంతంగా వాడుకుంటున్నారు. నెల్లూరు నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలోనే రోజుకు సరాసరి పది మంది డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఇక నారాయణ, కిమ్స్, మెడికవర్, అపోలో హాస్పిటళ్లను కలిపి లెక్క చూస్తే ఆ సంఖ్య అధికంగానే ఉంటుంది.

ఇబ్బందులిలా..



• కిడ్నీలతోపాటు లివర్, గుండె, రక్త ప్రసరణలో సమస్యలొస్తాయి.
• కడుపులో మంట, పేగులో పొక్కడం, పుండ్లు ఏర్పడడం, ముక్కుకు సంబంధించి నాసియా సమస్యలుంటాయి.
• మలబద్ధకం, డయేరియాలాంటివి రావొచ్చు.

వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలు జరగాలి

• పల్మనాలజిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కాన్ఫరెన్స్‌లో వక్తలు



పల్మనాలజీ సెమినార్ పుస్తకాలను ప్రదర్శిస్తున్న ఎంపీ, డాక్టర్లు

నెల్లూరు(అర్బన్): సమాజంలో వస్తున్న కొత్త జబ్బులను అడ్డుకునేందుకు వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలు జరగాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అసోసియేషన్ ఆఫ్ పల్మనాలజిస్ట్ సీమాంధ్ర (ఏపీఎస్ఏపీఎస్) రాష్ట్ర కాన్ఫరెన్స్ శనివారం నగరంలోని అనిల్ గార్డెన్స్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఊపిరితిత్తుల వ్యాధులు, చికిత్సలు, శస్త్ర చికిత్సల్లో సరికొత్త టెక్నాలజీని వినియోగిస్తూ ప్రజలకు తక్కువ ఖర్చుతోనే నాణ్యమైన వైద్యసేవలందించాలన్నారు. ప్రభుత్వాలు వైద్యరంగానికి పెద్దపీట వేయాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా వివిధ పుస్తకాలు, బ్రోచర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నిర్వహణా కార్యదర్శి డాక్టర్ పిట్టి మల్లికార్జునరావు, అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ప్రేమానందరాయ, నాయకులు డా.రవీంద్రబాబు, డా.గౌరీశంకర్, డా.కల్యాణి, ఐఎంఏ రాష్ట్ర నాయకుడు డాక్టర్ అశోక్, టీడీపీ నాయకుడు బీద రవిచంద్రతదితరులు పాల్గొన్నారు.

బాలికల పాఠశాలలో లైబ్రేరియన్ అసభ్య చేష్టలు



లైబ్రేరియన్ చర్యలను వివరిస్తున్న టీచర్లు



మత్తులో ఉన్న శ్రీనివాసులు

ఆత్మకూరు రూరల్: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న పసుపులేటి శ్రీనివాసులు అసభ్య చేష్టలపై సుమారు 20 మంది మహిళా టీచర్లు మండిపడ్డారు. అతను శనివారం మత్తు పదార్థం సేవించి రాగా వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీనివాసులు నిత్యం మద్యం, ఇతర మత్తు పదార్థాలు సేవించి పాఠశాలకు రావడమే కాకుండా విధి నిర్వహణలో అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని ప్రధానోపాధ్యాయురాలు కోటేశ్వరి వాపోయారు. గతంలో ఓ టీచర్ల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చామని, అయినా చర్యలు లేకపోవడంతో పరిస్థితి దారుణంగా మారిందని వెల్లడించారు. 20వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కరరెడ్డి, ఇతర నాయకులు పాఠశాలకు వెళ్లి లైబ్రేరియన్‌ను మందలించారు. ఈ విషయమై ఆత్మకూరు ఎస్సై ముత్యాలరావు మాట్లాడుతూ తమకు లిఖిత పూర్వక ఫిర్యాదు అందలేదని తెలిపారు.

స్కూటీపై వెళ్తుండగా..

• జాతీయ రహదారిపై ప్రమాదం
• వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు భగత్‌సింగ్ కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. నవాబుపేట నజీర్ తోటలో షేక్ హాజీ రహంతుల్లా (52) నివాసం ఉంటున్నాడు. ఆయన వ్యవసాయ మోటార్ పంపులు రిపేర్ చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈనెల 2వ తేదీ రాత్రి 7 గంటలకు కొడవలూరులోని బంధువుల బర్త్‌డే ఫంక్షన్‌కు స్కూటీపై వెళ్లాడు. కార్యక్రమం పూర్తయ్యాక జాతీయ రహదారిపై ఇంటికి బయలుదేరాడు. భగత్‌సింగ్‌కాలనీ జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి కావలి వైపు నుంచి చెన్నై వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం వేగంగా స్కూటీని ఢీకొని వెళ్లిపోయింది. కిందపడిన హాజీ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వెళ్తున్న వారు ఈ విషయాన్ని గమనించి మృతుడి సెల్‌ఫోన్ నుంచి బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. హాజీ కుమారుడు సైఫ్ అలీ, బంధువులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రమాద ఘటనపై నార్త్ ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించగా వారు వివరాలు సేకరించారు. జీజీహెచ్‌లో శనివారం ప్రభుత్వ వైద్యులు మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి బాధిత కుటుంబానికి అప్పగించారు. నార్త్ ట్రాఫిక్ ఎస్సై కె.గీతారమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

8న నెల్లూరులో జాబ్‌మేళా

నెల్లూరు(బారకాసు): ఈనెల 8వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం.వినయ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు నెల్లూరులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో శ్రీరామ్ ఫైనాన్స్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ బ్యాంకు ప్రతినిధులు మేళా నిర్వహిస్తారన్నారు. ఏదైనా డిగ్రీ చదివి 18 – 30 సంవత్సరాల్లోపు వయసున్న వారు అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థత సర్టిఫికెట్లతో మేళాకు హాజరుకావాలని తెలియజేశారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.70
సన్నవి : రూ.50
పండ్లు : రూ.40

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.110
లేయర్	రూ.90
బ్రాయిలర్ చికెన్:	రూ.204
స్కిన్‌లెస్ చికెన్:	రూ.230
లేయర్ చికెన్:	రూ.153